సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అపోలో వైద్యుడు అబ్దుల్ ఖాన్‌కు అవార్డు



సదస్సులో ప్రతినిధుల నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డాక్టర్ అబ్దుల్‌ఖాన్

ఆరిలోవ: హెల్త్ సిటీ అపోలో ఆస్పత్రిలో సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ డి ఖాన్‌కు సిల్వర్ జుబ్లీ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఇటీవల నగరంలో జరిగిన ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఓఎస్ఎస్ఏపీ) వార్షిక సదస్సులో ఈ అవార్డు అందించినట్లు డాక్టర్ ఖాన్ తెలిపారు. దీర్ఘకాలిక సైనోవైటిస్ చీలమండ.. చీలమండ ఆర్థ్రో స్కోపీ ఫలితాలపై చేసిన పరిశోధనకు ఈ అవార్డు లభించిందన్నారు. సదస్సులో కోయంబత్తూర్‌కు చెందిన గంగా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రాజశేఖరన్, ఓఎస్ఎస్ఏపీ అధ్యక్షుడు డాక్టర్ సునంద కుమార్ రెడ్డి ఈ అవార్డు, పతకం, ప్రశంసా పత్రాలను అందజేశారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాన్‌ను అపోలో నిర్వాహకులు, వైద్యులు సోమవారం అభినందించారు.

పెదవాల్తేరు గ్రామ నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గం

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు గ్రామ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బచ్చు తవిటి రెడ్డి, కార్యదర్శిగా మరడ శ్రీనివాస రెడ్డి, ట్రెజరర్‌గా వాకాడ బాపిరెడ్డి ఎన్నికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

భారత్‌లో 1.8 బిలియన్ల డాలర్ల పెట్టుబడి

బీచ్‌రోడ్డు: గ్లోబల్ అలయన్స్ భాగస్వామి రెనాల్ట్‌తో కలిసి భారత్‌లో ఇప్పటి వరకు 1.8 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టామని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నైలో తయారీ కర్మాగారం, పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి దేశీయంగా ఎగుమతి మార్కెట్‌ను విస్తరిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏడో షోరూం, సర్వీస్ సెంటర్‌ను విశాఖలో ఇటీవలే నేవీ ఉన్నతాధికారులచే ప్రారంభించినట్లు చెప్పారు.

టూ వీలర్ పార్కింగ్ కేంద్రం ప్రారంభం



పార్కింగ్ ప్రాంతాన్ని ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: పోలీస్ కమిషనరేట్ పరిధి ఆర్మ్‌డ్ రిజర్వ్ బారెక్స్ నందు సిబ్బంది కోరిక మేరకు నిర్మించిన టూవీలర్ పార్కింగ్ కేంద్రాన్ని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది తనకు వాట్సాప్ ద్వారా విన్నవించిన సమస్యకు స్పందించి 120 ద్విచక్ర వాహనాలు నిలుపుకునే పార్కింగ్ కేంద్రం నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 (టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ – యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

ఏ వీధిలో చూసినా.. అంధకారమే..

వైఎంసీఏ నుంచి ఏయూ హాస్టల్స్ వైపు వెళ్లే మార్గంలో చీకట్లు



● వెలగని వీధి దీపాలు
● పట్టించుకోని అధికారులు



జీవీఎంసీ గెస్ట్ హౌస్ మార్గంలో..



లలితాదేవి ఆలయ మార్గంలో..

ఏయూక్యాంపస్: వీధుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. వీధి దీపాల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడంతో అంతటా అంధకారమే నెలకొంటోంది. సాగర తీరానికి చేరువలో ఉన్న 21వ వార్డులోని పలు ప్రాంతాలలో ఇదే పరిస్థితి ఉంది. దాదాపు యాభై శాతం వరకు వీధి దీపాలు పనిచేయకపోవడం, వెలగక పోవడం సర్వసాధారణ విషయంగా మారిపోయింది.

ఒక్క దీపమే మిణుకుమిణుకుమంటూ..



వార్డులోని ఏ వీధిలో చూసినా సగానికి పైగా దీపాలు వెలగడం లేదు. ప్రధానంగా వీఐపీలు, విశ్రాంత న్యాయమూర్తులు, విశ్రాంత ఐఏఎస్ అధికారులు, వైద్యులు, వ్యాపారవేత్తలు నివసించే కిర్లంపూడి లే అవుట్ ప్రాంతంలో అధిక శాతం దీపాలు వెలగడం లేదు. ఇక్కడ ఒక్కో స్తంభానికి వీ అక్షరం ఆకారంలో రెండు ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. వీటిలో అధికంగా ఒక్క దీపం మాత్రమే వెలుగుతోంది. కొన్ని ప్రాంతాలలో రెండూ వెలగని పరిస్థితి ఉంది. మరికొన్ని ప్రాంతాలలో సోలార్ పలకతో కూడిన విద్యుత్ దీప స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇవి పూర్తిగా పనిచేయడం లేదు. వీటికి మరమ్మతులు చేపట్టడం, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం వంటి చర్యలు జీవీఎంసీ చేపట్టడం లేదు.



అంబికా సీ గ్రీన్ హోటల్ సమీపంలో వెలగని దీపాలు

బిక్కుబిక్కుమంటూ..

జీవీఎంసీ 21వ వార్డు పరిధిలోని కిర్లంపూడి లే అవుట్, ఏయూ అవుట్ గేట్, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లోని పలు వీధుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. రాత్రి ఏడు గంటల తరువాత కొన్ని వీధుల్లో ఒంటరిగా నడిచి వెళ్లడానికి మహిళలు, చిన్నారులు భయపడే పరిస్థితులు ఉన్నాయి. వీధులు నిర్మానుష్యంగా ఉండటం, వీధిదీపాలు సైతం వెలగకపోవడంతో వీరు భయపడుతున్నారు. పలు వీధుల్లో రాత్రివేళల్లో కుక్కల సంచారం కూడా ఉండటంతో అటువైపు వెళ్లాలంటేనే హడలిపోతున్నారు.

అడ్డుతున్న చెట్ల కొమ్మలు

ఉన్న కొద్దిపాటి వీధిదీపాలు వెలుగుతున్నాయనుకుంటే వీటిని చెట్ల కొమ్మలు అడ్డేస్తున్నాయి. దీంతో అంతంతమాత్రంగానే వెలుతురు రోడ్డుపై పడుతోంది. చెట్ల కొమ్మలను ప్రూనింగ్ చేయడం, విద్యుత్ దీపాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంపై జీవీఎంసీ సిబ్బంది దృష్టి పెట్టడం లేదు. వీధి దీపాల నిర్వహణ కాంట్రాక్ట్ తీసుకున్న వారు సైతం వీటి నిర్వహణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదు.

పర్యాటకులు అధికంగా సందర్శించే పాండురంగాపురం, కిర్లంపూడి లే అవుట్, ఈస్ట్‌పాయింట్ కాలనీ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. పలు గెస్ట్ హౌస్‌లు సైతం ఈ ప్రాంతంలో ఉండటంతో చీకట్లు కమ్ముకున్న వీధులను చూసి సందర్శకులు విస్తుపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

రాత్రివేళల్లో ప్రయాణం కష్టం

రాత్రివేళల్లో విద్యుత్ దీపాలు వెలగక వీధులన్నీ చీకటిగా ఉంటున్నాయి. ఆ సమయంలో మహిళలు, చిన్నారులు రోడ్లపై వెళ్లాలంటే భయపడుతున్నారు. అధికారులు స్పందించి వెలగని దీపాలను మార్చాలి.

– వెంకటేశ్వరరావు, కిర్లంపూడి లే అవుట్

భయంగా ఉంటోంది

చాలా వీధుల్లో దీపాలు సరిగా వెలగడం లేదు. కొన్ని చోట్ల దీపాలు పాడైపోయాయి. వీటికి అవసరమైన మరమ్మతులు చేయడం లేదు. రాత్రివేళల్లో చీకటిగా ఉన్న రోడ్లపై ప్రయాణించాలంటే భయంగా ఉంటోంది.

– పి.పద్మ కళ, ఏయూ అవుట్ గేట్

జాతీయ మూట్ కోర్టు పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

విశాఖ విద్య: జాతీయ మూట్ కోర్టు పోటీలు–2025 పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు, రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు సోమవారం ఆవిష్కరించారు. మార్చి 21 నుంచి 23 వరకు ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం తెలిపారు. జాతీయ మరియు రాష్ట్ర స్థాయిలో వివిధ విశ్వవిద్యాలయాలు/సంస్థల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ నాగరాజ కుమారి, డాక్టర్ ఎల్.వి.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ బలగాలకు శారీరక దృఢత్వం అవసరం




వ్యాయామం చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఆరిలోవ: సాయుధ బలగాలకు శారీరక, మానసిక దృఢత్వం అవసరమని అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలతో విశాలాక్షినగర్ కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో రిజర్వ్ పోలీస్ సిబ్బందికి సోమవారం వార్షిక మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పోలీస్ సిబ్బందికి శారీరక దృఢత్వ పరీక్షలు నిర్వహించారు. వివిధ రకాల వ్యాయామాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలో సిబ్బంది సమర్థవంతంగా వ్యవహరించడానికి రిఫ్రెష్‌మెంట్ ట్రైనింగ్ ఎంతో అవసరమన్నారు. ఇలాంటి శిక్షణ సిబ్బందిలో వృత్తి నైపుణ్యం మెరుగుపరుచుకోవడానికి, ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగ బాధ్యతతో పాటు వ్యక్తిగత జీవితం, కుటుంబ సంక్షేమంపై కూడా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్‌ఐలు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, అరవింద్ కిషోర్, సంజీవిరావు, ఆర్ఎస్‌లు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇసుకకొండపై మాఘ పౌర్ణమి పూజలు



రమా సహిత సత్యనారాయణస్వామి



ఇసుకకొండపై సత్యదేవుని ఆలయం

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 12న మాఘ పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మాఘ పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామి దర్శనానికి తరలి రానున్న దృష్ట్యా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ముందుగా సముద్ర స్నానమాచరించి సత్యదేవుడిని దర్శించుకోనున్నారు. నగరం నుంచే కాకుండా జిల్లా నలుమూలలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఆ రోజు వేకువజామున 2.30 గంటలకే ఆలయాన్ని తెరిచి, స్వామి ఆరాధనాది కార్యక్రమాల అనంతరం ఉదయం 4 గంటలకు ధ్వజస్తంభం వద్ద పూజలు, 4.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. ఉదయం 7 గంటలకు, 10.30 గంటలకు ప్రత్యేక వ్రతాలు (పూజా రుసుం రూ.1,116), సామూహిక వ్రతాలు ఉదయం 8.30 గంటలకు (పూజా రుసుం రూ.516) నిర్వహించనున్నారు. ఉచిత దర్శనంతోపాటు ప్రత్యేక టిక్కెట్ ద్వారా స్వామి దర్శనం కల్పించనున్నారు. మాఘ పౌర్ణమి సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా భద్రతా చర్యల కోసం పోలీసులను ఏర్పాటు చేస్తున్నామని, ఉచిత ప్రసాదం పంపిణీ చేయనున్నామని తెలిపారు. భక్తులు పూర్ణామార్కెట్ సమీపాన దయారాం స్వీట్స్ పక్క నుంచి దేవాలయానికి నూతనంగా ప్రారంభించిన ఫూట్ రోడ్డు ద్వారా చేరుకోవాలని సూచించారు.

నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలి

మహారాణిపేట: రోజురోజుకీ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. పద్మ మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధరలు అమాంతం పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అరకొరగా సరకులు అందివ్వడం సరికాదన్నా రు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం తరహాలో 14 రకాల సరకులను రేషన్ కార్డుపై ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



విద్యార్థికి మాత్రలు వేస్తున్న దృశ్యం

బీచ్‌రోడ్డు: డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మద్దిలపాలెం సచివాలయం ఏఎన్ఎం జి.మాలతి, ఆశ వర్కర్లు వై.జానకి, కె.గీత పాల్గొన్నారు.

యాప్‌ట్రోనిక్స్‌లో చోరీకి యత్నం..?

బీచ్‌రోడ్డు: ఇద్దరు వ్యక్తులు యాప్‌ట్రోనిక్స్‌లో చోరీ చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం . మద్దిలపాలెం నుంచి కాంప్లెక్స్ వెళ్లే మార్గంలో ఉన్న యాపిల్ షోరూం యాప్‌ట్రోనిక్స్‌లో ఇద్దరు వ్యక్తులు సోమవారం హెల్మెట్ ధరించి ప్రవేశించారు. దీంతో భయాందోళన చెందిన సిబ్బంది మూడో పట్టణ క్రైం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అయితే తాము నేవీ ఉద్యోగులమని, చోరీకి రాలేదని కొనుగోలు చేయటానికి వచ్చామని చెబుతున్నారు. దీనిపై పోలీసులు ఇంకా విచారణ కొనసాగిస్తున్నారు.

కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ

మద్దిలపాలెం: ఇటీవల విజయవాడలో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అటానమస్ హ్యాకథాన్ 2025 కార్యక్రమంలో డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇందులో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నరవ ఉమా మహేష్, పల్లి దానవేంద్ర ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు అభినందించారు. డాక్టర్ ఎ.శివ ప్రసాద్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎస్.సాంబ మూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

అమర్‌నాథ్‌కు సత్కారం



మాజీ మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న ప్రేమ్ కిరణ్ తదితరులు

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా వలంటీర్ విభాగం ఆధ్వర్యంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఇటీవల జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడిగా తూర్పు నియోజకవర్గానికి చెందిన పీలా ప్రేమ్ కిరణ్ నియమితులైన విషయం తెలిసిందే. గతంలో తూర్పు నియోజకవర్గం పార్టీ యువజన విభాగం ప్రతినిధిగా విధులు నిర్వర్తించిన ప్రేమ్‌ను వలంటీర్ విభాగం అధ్యక్షుడిగా నియమించిన నేపథ్యంలో, ఆయన ఆధ్వర్యంలో విభాగంలోని ముఖ్యనాయకులు అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు హరికిరణ్ రెడ్డి, పలువురు వలంటీర్ విభాగం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ నిత్యానంద త్రయోదశి



పుష్పాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: శ్రీనిత్యానంద త్రయోదశి ఉత్సవాన్ని ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ నిత్యానంద ప్రభువు దివ్య ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకుని హరేకృష్ణ మూవ్‌మెంట్, విశాఖపట్నం ఆధ్వర్యంలో సోమవారం ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యానంద, శ్రీకృష్ణ చైతన్య మహా ప్రభువులకు సప్తనదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో మహా అభిషేకం చేశారు. 108 కలశాలతో పంచామృతాభిషేకం, సువాసనలతో కూడిన పుష్పాలతో, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 58 రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ ద్వాపరయుగంలో బలరామ భగవానుడే అనంతర కాలంలో నిత్యానంద ప్రభువుగా అవతరించినట్లు తెలిపారు. పలువురు సంస్థ ప్రతినిధులు, వేదపండితులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

పట్టు జారితే.. ప్రమాదమే..



భవన నిర్మాణ వ్యర్థాలను తరలించే వ్యాన్‌పై దుమ్ము రేగకుండా కట్టిన గోనెసంచిపై కూర్చుని, ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారు కొందరు కార్మికులు. ఏ మాత్రం కాస్త జారినా, చిన్నగా రెప్ప పడినా పెద్ద ప్రమాదమే వాటిల్లే పరిస్థితి. బీచ్‌రోడ్డులో కనిపించిన ఈ దృశ్యం ఒక్క క్షణం గగుర్పాటు కలిగించింది. ప్రాణాల మీదకు తెచ్చే ఇటువంటి ప్రయాణాలు మానుకోవడం వారి కుటుంబాలకు కూడా శ్రేయస్కరం.

– ఏయూక్యాంపస్

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వైభవంగా లలితా కామేశ్వరుల కల్యాణం

సీతంపేట : శ్రీలలితాపీఠంలో శ్రీలలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పీఠం 76వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి పర్యవేక్షణలో కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. కుర్తాళం పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ వేద మంత్రాల మధ్య లలితా కామేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తకంగా కల్యాణం చేశారు. లలితా కామేశ్వరుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, అభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. ముందుగా లలితా కామేశ్వరులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం ప్రాంగణాన్ని, లలితాదేవి సన్నిధిని, దర్బారు హాలును వివిధ రకాల పువ్వులు, పండ్లతో ఆకర్షణీయంగా అలంకరించారు. సుముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కల్యాణం తిలకించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం లలితా అమ్మవారికి 250 కిలోల అన్నాభిషేకం నిర్వహించనున్నామని, మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, సామూహిక కుంకుమ పూజ జరిపిస్తామని పీఠం మేనేజర్ తెలిపారు.